చదరంగ విజేతలకు
ఘన స్వాగతం




▸ గుకేశ్‌ను అభినందిస్తున్న అధికారులు ▸ పతకాలతో ప్రజ్ఞానంద, వైశాలి, శ్రీనాథ్

సైదాపేట, న్యూస్‌టుడే: చదరంగ విజేతలకు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషులు, మహిళల జట్లు పసిడి పతకాలు సాధించి రికార్డు సృష్టించాయి. పురుషుల జట్టులో చెన్నైకి చెందిన గుకేశ్, ప్రజ్ఞానంద, మహిళల జట్టులో వైశాలిలు ఉండటం గమనార్హం. మంగళవారం ఉదయం 8.30కు చెన్నై చేరుకున్న గుకేశ్‌కు విమానాశ్రయంలో తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్, తమిళనాడు చెస్ సంఘం తరఫున ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి, పూలమాలలు వేశారు. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ జనరల్ మేనేజర్ సుజాత, తమిళనాడు చెస్ సంఘం కార్యదర్శి స్టీఫెన్ బాలసామి, కోశాధికారి శీనివాసన్, వేలమ్మాళ్ పాఠశాల రిజిస్ట్రార్ వేల్‌మోహన్ తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి 12.20కు చెన్నై చేరుకున్న ప్రజ్ఞానంద, వైశాలి, కెప్టెన్ శ్రీనాథ్‌లు చెన్నై చేరుకోగా వారికి కూడా విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.



విద్యార్థికి ప్రవేశపత్రం అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఉన్నతవిద్య అభ్యసించండి

వేలూర్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నతవిద్య అభ్యసించాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉయర్ కల్విక్కు పడి' పథకంపై వేలూర్ ఊరీస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నతవిద్య వరకు వెళ్లలేని విద్యార్థులను ఎంపిక చేసి శిబిరం నిర్వహించి కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ప్లస్‌టూతో ఆగిపోయిన విద్యార్థులు ఈ పథకాన్ని ఉపయోగించుకొని ఉన్నతవిద్య అభ్యసించాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలు ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'పుదుమైపెణ్ తిట్టం' తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 8వేల మంది లబ్ధి పొందారన్నారు. సహాయ కలెక్టర్ బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయొద్దు

ప్యారిస్, న్యూస్‌టుడే: నో పార్కింగ్ బోర్డులు అనుమతి లేకుండా ఏర్పాటు చేయకూడదని గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నివాస ప్రాంతాలు, వాణిజ్య సంస్థల వద్ద నో పార్కింగ్ బోర్డులు, ఇసుక మూటలు పెట్టడం అధికమైందన్నారు. అనుమతి లేకుండా ఏర్పాటుతో ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బంది తలెత్తుతోందన్నారు. అనుమతి లేకుండా బోర్డులు పెడితే హైకోర్టు ఉత్తర్వుల మేరకు చట్ట ప్రకారం చర్యలు చేపడతారన్నారు. ఇప్పటికే అలాంటివి ఉంటే వాటిని తొలగించాలన్నారు. వాహనాలను రోడ్లపై ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నిలిపి ఉంచకూడదని సూచించారు.



మెరుగైన సేవలకు
పురస్కారాల వెల్లువ



ఆరోగ్యశాఖకు 3 ఏళ్లలో 545 అవార్డులు

ఆరోగ్యశాఖలో మెరుగైన సేవలు అందిస్తుండటంతో మూడేళ్లలో 545 పురస్కారాలు వరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందాలని సీఎం స్టాలిన్ పలు పథకాలు అమలు చేస్తున్నారు. ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించేలా ముఖ్యమంత్రి స్టాలిన్ 'మక్కల్ తేడి మరుత్తువం' పథకాన్ని 2021 ఆగస్టు 5న ప్రారంభించారు. మూడేళ్లలో ఈ పథకం ద్వారా రూ.632.80 కోట్ల ఖర్చుతో 1.85 కోట్ల మంది లబ్ధిపొందారు.

- న్యూస్‌టుడే, ఆర్కేనగర్

■ క్షతగాత్రులకు చికిత్స..

రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారిని వెంటనే ఆస్పత్రులకు తరలించకపోవడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు 'ఇన్నుయిర్ కాప్పోం- నమ్మై కాక్కుమ్ 48 తిట్టం' పథకాన్ని 2021 డిసెంబరు 18న ప్రారంభించారు. 237 ప్రభుత్వ, 455 ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటివరకు 2.25 లక్షల మందికి వెంటనే చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.

■ కార్మికుల కోసం..

తొలిలార్గళై తేడి మరుత్తువం(కార్మికుల చెంతకే వైద్యం) పథకాన్ని తిరువళ్లూర్ జిల్లా కడంబదూర్‌లోని హ్యుందాయ్ మొబైల్ పరిశ్రమలో ఈ ఏడాది జనవరి 9న ప్రారంభించారు. 711 పరిశ్రమల్లో 5,27,000 మంది కార్మికులకు వైద్య పరీక్షలు జరిపారు. 26,861 మంది చికిత్స పొందుతున్నారు.

■ శిబిరాలు ఏర్పాటు చేసి..

'కలైంజ్ఞర్ వరుముణ్ కాప్పోం' పథకాన్ని 2007లో ప్రారంభించారు. పదేళ్లపాటు పక్కన పడేశారు. ఆ పథకం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 'కలైంజ్ఞరిన్ వరుముణ్ కాప్పోం'గా పేరు మార్చి మళ్లీ అందుబాటులోకి తెచ్చారు. మూడేళ్లలో 4,042 శిబిరాలు నిర్వహించారు. 36.69 లక్షల మందికి లబ్ధి చేకూరింది.

■ మూత్రపిండాల సమస్యకు ప్రత్యేకంగా..

కిడ్నీ సమస్యను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు 'సిరునీరగ పాదుకాప్పు తిట్టం' ప్రవేశపెట్టారు. సేలం జిల్లా కాడైయాంబట్టిలో 2023 జూలై 10న ప్రారంభించారు. 56.7 లక్షల మందికి ప్రయోజనం చేకూరింది. కలైంజ్ఞర్ బీమా ద్వారా ప్రస్తుతం 1.47 కోట్ల కుటుంబాలు లబ్ధిపొందాయి.

■ అవయవదాతలకు..

అవయవదానం చేసేవారికి ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని 2023 సెప్టెంబరు 23న ప్రకటించి ప్రోత్సహించింది. ఇప్పటివరకు 467 మంది దాతల నుంచి 223 గుండెలు, 292 ఊపిరితిత్తులు, 490 కాలేయాలు, 810 మూత్రపిండాలు దానంగా పొందారు. పలువురు పునర్జన్మ పొందారు. వైద్యసిబ్బంది ఎంపిక బోర్డు ద్వారా మూడేళ్లలో 1,947 మంది వైద్యులతోపాటు 3,238 మందిని నియమించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒప్పంద విధానంతో పనిచేస్తూ వచ్చిన 11,911 మంది నర్సులను కాలానుగుణ చెల్లింపుపై నియమించారు. కరోనా వ్యాప్తి కాలంలో తాత్కాలికంగా సేవలందించిన 1,412 మంది నర్సులను ఒప్పంద పద్ధతిలోకి తీసుకున్నారు.

■ ఇతర దేశాలు, రాష్ట్రాల ప్రశంసలు..

గర్భిణీలకు హెపటైటిస్ బి పరీక్షలు చేయడంలో దేశంలోనే రాష్ట్రం మొదటిస్థానంలో నిలిచి పురస్కారం అందుకుంది. టెలిమెడిసిన్ సేవలో మొదటి బహుమతి దక్కింది. గర్భిణులకు సేవల్లో ఉత్తమ రాష్ట్రంగా పురస్కారం అందుకుంది. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఉత్తమ రాష్ట్రం, తమిళనాడు స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి ఉత్తమ సేవా పురస్కారం దక్కాయి. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ అవార్డును 2012లో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2012 నుంచి 2021 వరకు 79 అవార్డులు మాత్రమే పొందింది. ముఖ్యమంత్రి స్టాలిన్ అందించిన ప్రోత్సాహంతో మూడేళ్లలో 545 అవార్డులు అందుకుంది. 2023 అక్టోబరు 3న గుజరాత్ నుంచి ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ రాజేష్ నేతృత్వంలోని వైద్యాధికారులు తమిళనాడులోని వైద్య సదుపాయాలను పరిశీలించేందుకు విచ్చేశారు. తమిళనాడులో వైద్య సదుపాయాలు భేషుగ్గా ఉన్నాయని, ఇలాంటివి గుజరాత్‌కు రావడానికి 20ఏళ్లు పడుతుందని తెలిపి అభినందించింది. మేఘాలయ రాష్ట్ర వైద్యబృందం, ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి రాష్ట్రానికి విచ్చేసి వైద్య సౌకర్యాలను పరిశీలించి ప్రశంసించారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్



పట్టాతో తంగమణి

ఘనంగా మద్రాస్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

- 1,07,821 మందికి పట్టాలు ప్రదానం
- ఉపకులపతి లేకుండానే నిర్వహణ

చెన్నై, న్యూస్‌టుడే: మద్రాస్ విశ్వవిద్యాలయం 166వ స్నాతకోత్సవం వర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా జరిగింది. కులపతి, గవర్నర్ ఆర్.ఎన్.రవి, సంయుక్త కులపతి, ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, ప్రత్యేక అతిథిగా ఓమ్ బాబా డీమ్డ్ యూనివర్సిటీ కులపతి, పద్మవిభూషణ్ అనిల్ కకోడ్కర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నేరుగా 1,031 మంది, ఇన్-ఆప్షన్సియా విధానంలో అనుబంధ కళాశాలల్లోని 89,053 మంది, డైరెక్టరేట్ ఆఫ్ డిస్టన్స్ ఎడ్యుకేషన్ ద్వారా 16,263 మంది, విశ్వవిద్యాలయ విభాగాల్లో 1,404 మంది, డాక్టర్ ఆఫ్ లిటరేచర్‌లో 70 మంది.. మొత్తంగా 1,07,821 మంది పట్టాలు పొందారు. భారత రాజ్యాంగంలోని కారుణ్య పిటిషన్‌పై రాష్ట్రపతి అధికారం, గవర్నర్‌కు ఉన్న అధికారాలపై చేసిన పరిశోధనకు ఆలంకుళం ఎమ్మెల్యే పీహెచ్‌పీ మనోజ్ పాండియన్, విశ్రాంత డీజీపీ జాంగిడ్ క్రిమినాలజీలో గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకున్నారు. చెన్నైలోని ప్రెసిడెన్సీ కళాశాల మాజీ అధ్యాపకుడు తంగమణి(78) డాక్టర్ ఆఫ్ లిటరేచర్ అందుకున్నారు.

సుదీర్ఘ చరిత్రలో.. మద్రాస్ విశ్వవిద్యాలయానికి ఏడాది కాలంగా ఉప కులపతి నియామకం జరగలేదు. వర్సిటీ కార్యకలాపాలు సమన్వయ కమిటీ నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరిగిన స్నాతకోత్సవంలో ధ్రువపత్రాల్లో ఉప కులపతి సంతకానికి బదులు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి చేసి విద్యార్థులకు అందించారు. విశ్వవిద్యాలయ 167ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఉప కులపతి లేకుండానే స్నాతకోత్సవం జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

78 ఏళ్ల వయసులో డాక్టరేట్

చెన్నై, న్యూస్‌టుడే: ఆయన విశ్రాంత అధ్యాపకుడు. చదువుపై ఆసక్తి తగ్గలేదు. భారతీయ వైద్యవిధానం సిద్ధపై థీసిస్ సమర్పించి ప్రస్తుతం 78ఏళ్ల వయసులో డాక్టరేట్ అందుకున్నారు. ఆయనే కన్నియాకుమరికి చెందిన పి.తంగమణి. చదువుకు, సాధించడానికి వయసు ఏమాత్రం అడ్డుకాదని నిరూపించారు. స్నాతకోత్సవంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి చేతుల మీదుగా డాక్టర్ ఆఫ్ లిటరేచర్ అందుకున్నారు. చెన్నైలోని ప్రెసిడెన్సీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడైన తాను సిద్ధ వైద్యవిధానంపై 2015లోనే థీసిస్ సమర్పించగా ప్రస్తుతం డాక్టరేట్ అందించారని తెలిపారు. పక్షవాతానికి, స్ట్రోక్‌కు అవసరమయ్యే సరైన మందులను సిద్ధవైద్య విధానంలో తయారు చేయొచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం లేదని, ఔషధ మొక్కలతో కూడిన కొండ ఉన్న కన్నియాకుమరిలో ఏర్పాటు చేయాలని కోరారు. తన పూర్వీకులు సిద్ధ వైద్యులని, అందుకే తనకు మక్కువ పెరిగిన పరిశోధన చేసినట్లు వివరించారు.

రాష్ట్రంలో 29 వరకు
వర్షాలు



ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 29 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం పేర్కొంది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో.. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య ఉన్న బంగాళాఖాతంలో సోమవారం రాత్రి తుపాను ఏర్పడింది. ఉత్తర, దక్షిణ తమిళనాడులో ఒకటి, రెండు చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో 29 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలకు అవకాశం ఉంది. 27 వరకు గల్ఫ్ ఆఫ్ మన్నార్, దక్షిణ తమిళనాడు సముద్రతీర ప్రాంతాలు, కన్నియాకుమరి సముద్రతీరాల్లో గంటకు 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. జాలర్లు ఆ ప్రాంతాలకు చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించింది. మంగళవారం సాయంత్రం చెన్నైలో పలుచోట్ల వర్షం కురిసింది. గిండి, నందనం, టీ నగర్, సైదాపేట, తేనాంపేట, ఈక్కాట్టుతాంగల్‌లో వర్షం కురిసింది.




చెన్నై ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

నిరాశ ఉండదు..
మార్పు తథ్యం
ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: మంత్రివర్గంలో మార్పు, ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవిపై విలేకర్లు లేవనెత్తిన ప్రశ్నకు 'నిరాశ ఉండదు.. మార్పు ఉంటుంది' అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ సమాధానమిచ్చారు. కొళత్తూర్ శాసనసభ నియోజకవర్గంలోని జీకేఎం కాలనీలో జరుగుతున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ముఖ్యమంత్రి మంగళవారం పరిశీలించారు. చెన్నై ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని 69వ డివిజన్‌లో నిర్మించిన చెన్నై ప్రాథమిక పాఠశాల, 67వ డివిజన్‌లోని మదురైసామి మఠంలో పునరుద్ధరించిన వ్యాయామశాల, 66వ డివిజన్‌లోని నేర్మైనగర్ స్మశానవాటికలో నిర్మించిన మండపాన్ని ప్రారంభించారు. తర్వాత పేపర్ మిల్స్ రోడ్డులో రెవెన్యూశాఖకు చెందిన స్థలంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. విదేశీ పర్యటన, పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలన్న ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి డిమాండ్‌పై స్పందించారు. ఇది మోసం చేసే ప్రాజెక్టు కాదని, ఇప్పటికే మంత్రి టీఆర్‌బీ రాజా ఈ విషయంలో స్పష్టత ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గంలో మార్పు, ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి వ్యవహారంపై లేవనెత్తిన ప్రశ్నకు స్పందిస్తూ... నిరాశ ఉండదని, మార్పు ఉంటుందని సమాధానమిచ్చారు.

మొక్కలు నాటుదాం.. సంరక్షిద్దాం

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ తాలూకా తండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం రాష్ట్ర అటవీశాఖ తరఫున హరిత తమిళనాడు ఉద్యమం రెండో వార్షికోత్సవం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, మాజీ సైనికుల సంక్షేమశాఖ మంత్రి సీవీ మెయ్యనాథన్, రాష్ట్ర అటవీశాఖ మంత్రి డాక్టర్ ఎం.మదివేందన్ కలిసి 1000 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటిన మొక్కలను సరంక్షించాలని పిలుపునిచ్చారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.



మొక్కకు నీళ్లు పోస్తున్న మంత్రి మదివేందన్

విద్యార్థుల మధ్య తారతమ్యాలు చూపొద్దు



తరగతి గది శుభ్రం చేస్తున్న కడలూర్ మేయర్ సుందరి రాజా

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో కడలూర్ మేయర్ సుందరి రాజా మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు పాదరక్షలను తరగతి గదికి బయట వదిలి ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల మధ్య ఎందుకు తారతమ్యాలు చూపుతున్నారని ప్రశ్నించారు. సరైన సమాధానం రాకపోవడంతో విద్యార్థులందరూ తరగతి గదిలోకి పాదరక్షలు వేసుకొని వెళ్లొచ్చన్నారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లిన మేయర్ అక్కడున్న చీపురు తీసుకొని అల్మారాలో ఉన్న దుమ్ము ధూళిని శుభ్రం చేయడంతో ఉపాధ్యాయులు, కార్పొరేషన్ అధికారులు నివ్వెరపోయారు. తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు హితవు పలికారు. మేయర్ వెంట కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి ఎళిల్ మదనా, అధికారులు ఉన్నారు.

సేలం కలెక్టర్‌కు అరెస్టు వారెంట్

ప్యారిస్, న్యూస్‌టుడే: సేలం జిల్లా కలెక్టర్‌కు మద్రాసు హైకోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. ఆమెను కోర్టులో హాజరుపరచాలని జిల్లా ఎస్పీకి ఉత్తర్వులు ఇచ్చింది. సేలానికి చెందిన మూర్తి మద్రాసు హైకోర్టులో.. జిల్లా కలెక్టరు బృందాదేవి, ఆమె వ్యక్తిగత సహాయకుడు రవిచంద్రన్, ప్రాంతీయ అభివృద్ధి అధికారి మాణిక్కవాసగం తదితరులపై కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. 2004లో జిల్లాలోని పలు పంచాయతీల కార్యదర్శిగా పనిచేసినట్లు, చందియూర్ ఆడైయంపట్టి పంచాయతీలో పని చేస్తున్న సమయంలో నిధులను దుర్వినియోగం చేసినట్లు 2017లో కలెక్టరు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రతి నగదు లావాదేవీ పంచాయతీ అధ్యక్షుడి ఆమోదం పొందిన తర్వాతే జరిగిందని, తనపై ఆరోపణల్లో నిజం లేకపోవడంతో హైకోర్టులో కేసు వేసినట్లు పేర్కొన్నారు. హైకోర్టు తన సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేసి, నగదు లావాదేవీలు అందించాలని గత సెప్టెంబరు 5న ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా అమలవలేదనానరు. విచారణకు కలెక్టరు హాజరవకపోవడంతో అరెస్టు వారెంట్ జారీచేసి, తదుపరి విచారణ అక్టోబరు 1కి వాయిదా వేశారు.

ఎన్ఐఏ సోదాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై సహా పలుచోట్ల ఎన్ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. హిజ్బ్ ఉత్ తహ్రీర్ సంస్థపై భారత్‌తోపాటు పలు దేశాలు నిషేధం విధించాయి. అందులోకి సభ్యులను చేర్చిన వ్యవహారమై చెన్నై రాయపేటకి చెందిన ప్రొఫెసర్ సహా పలువురు అరెస్టయ్యారు. చెన్నై సైబర్ క్రైం పోలీసులు తొలుత ఈ కేసును ఛేదించారు. అనంతరం దర్యాప్తు ఎన్ఐకి బదిలీ అయింది. అరెస్టు చేసిన వారిని కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేయడంతో పలు విషయాలు తెలిశాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చెన్నైలో పది చోట్ల, పుదుక్కోట్టై, నాగర్‌కోవిల్‌లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. పలు ముఖ్య పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



నన్మంగళంలో సోదాలు చేపట్టిన ఇల్లు

ఆస్పత్రి నుంచి దురై దయానిధి డిశ్చార్జి



ఆస్పత్రి నుంచి కారులో వెళుతున్న దురై దయానిధి

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంకే అళగిరి కుమారుడు దురై దయానిధి మంగళవారం డిశ్చార్జి అయ్యారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు, కేంద్ర మాజీ మంత్రి ఎంకే అళగిరి కుమారుడు దురై దయానిధి గతేడాది డిసెంబరు 6న ఆకస్మికంగా అనారోగ్యం పాలై చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అనంతరం ఫిజియోథెరపీ కోసం వేలూర్ సీఎంసీ ఆస్పత్రిలో మార్చి 14న చేర్చారు. ముఖ్యమంత్రి స్టాలిన్ రెండుసార్లు వచ్చి దురై దయానిధి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. కోలుకున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి డిశ్చార్జి అయ్యారు. తండ్రి ఎంకే అళగిరి, బంధువులు కారులో చెన్నై తీసుకెళ్లారు. ఆస్పత్రి నుంచి దురై దయానిధి బయటకు రావడాన్ని ఫొటోలు, వీడియోలు తీసేందుకు విలేకర్లు గుమిగూడారు. ఎంకే అళగిరి కుటుంబీకులు ఫొటోలు, వీడియోలు తీయొద్దని విలేకరులపై దాడి చేయడం కలకలం సృష్టించింది.

రాష్ట్రం.. మత్తుపదార్థాలకు చిరునామా
అన్నాడీఎంకే ఆందోళన




▸ ప్రసంగిస్తున్న మాజీ మంత్రి వళర్మతి ▸ పాల్గొన్న మహిళా విభాగ నిర్వాహకులు

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు మత్తుపదార్థాల చలామణికి చిరునామాగా మారిందని అన్నాడీఎంకే మహిళా విభాగ కార్యదర్శి, మాజీ మంత్రి వళర్మతి ధ్వజమెత్తారు. డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ అన్నాడీఎంకే మహిళా విభాగం తరఫున మంగళవారం చెన్నై వళ్లువర్‌కోట్టంలో ఆందోళన జరిగింది. వళర్మతి మాట్లాడుతూ.. డీఎంకే అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం, చలామణి పెరిగిందని ఆరోపించారు. ఈ విషయమై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి అసెంబ్లీలో, నివేదికల ద్వారా తెలియజేసినా డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆరోపించారు. తమిళనాడులో రెండు గంటలకో మహిళ లైంగిక హింసకు గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మహిళలు ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. అన్నాడీఎంకే సంస్థాగత కార్యదర్శి, మాజీ మంత్రి గోకుల ఇందిరా, నటీమణులు విద్య, గాయత్రి రఘురామ్, రాష్ట్ర, జిల్లా మహిళా విభాగ నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు.

శాంసంగ్ కార్మికులకు షోకాజ్ నోటీసులు


సమ్మె చేస్తున్న కార్మికులు

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకు 16 రోజులుగా సమ్మె చేస్తున్న శాంసంగ్ కార్మికులకు గుర్తింపు కార్డులు లేదని, దీపావళి బోనస్ ఇచ్చేది లేదని సంస్థ నిర్వాహకులు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కాంచీపురం జిల్లా సుంగువారిసత్రం సమీపంలో ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు తయారు చేసే శాంసంగ్ పరిశ్రమ ఉంది. సుమారు 5వేల మందికి పైగా పని చేస్తున్నారు. వారిలో 1,500 మంది శాశ్వత ఉద్యోగులు. వేతనాల పెంపు, 8 గంటల పని తదితర డిమాండ్లతో సీఐటీయూ గుర్తింపు పొందిన కార్మికులు ఈనెల 9 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని మెరుగుపరచండి

కేంద్రమంత్రికి స్పీకర్ వినతి


కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న స్పీకర్ సెల్వం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ఈఎస్ఐ ఆస్పత్రి అభివృద్ధికి అదనంగా నిధులు కేటాయించి మెరుగుపరచాలని కేంద్ర మంత్రికి పుదుచ్చేరి స్పీకర్ సెల్వం మంగళవారం వినతి పత్రం అందించారు. దిల్లీలో కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సూక్ మాండవియాను కలిసిన ఆయన 'పుదుచ్చేరి రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి అదనంగా నిధులు కేటాయించి విస్తరింపజేసి అన్ని రకాల చికిత్స అందించేలా అభివృద్ధి చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త మీటర్లకు ఎదురుచూపులు

3 నెలలుగా 1.5 లక్షల మంది నిరీక్షణ

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాడైపోయిన విద్యుత్తు మీటర్ల స్థానంలో కొత్తవి ఎప్పుడు ఏర్పాటు చేస్తారా అని 1.5 లక్షల మంది వినియోగదారులు నిరీక్షిస్తున్నారు. టాన్‌జెడ్కో అమర్చిన డిజిటల్ డిస్‌ప్లే మీటర్లు పనిచేయక 3 నెలలైనా కొత్తవాటిని అమర్చలేదు.

నెలలు గడుస్తున్నా...

మీటర్లు పాడైపోయి నెలలు గడుస్తున్నా టాన్‌జెడ్కో నుంచి ఎలాంటి సమాచారం లేదని పలువురు వినియోగదారుల ఆరోపిస్తున్నారు. రాధాకృష్ణన్ సాలైలోని ఓ హోటల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మీటర్ పనిచేయడంలేదు. ఈ కారణంగా అప్పటి నుంచి నెలకు రూ.55వేల వరకు హోటల్ యాజమాన్యం విద్యుత్తు బిల్లు చెల్లిస్తోంది. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా టాన్‌జెడ్కో నుంచి ఎలాంటి పరిష్కారం కనిపించలేదు. మీటర్ల కొరతే కారణంగా టాన్‌జెడ్కో పేర్కొంటోంది.

చెన్నై, పరిసరాల్లో..


చెన్నై, పరిసర ప్రాంతాల్లోని జిల్లాల్లో 48వేల మంది వినియోగదారులు మీటర్ల కోసం వేచి ఉన్నారు. పలు మార్లు టాన్‌జెడ్కో అధికారులకు ఫిర్యాదులు చేశారు. మీటర్లు సరిగా పని చేయక పోవడంతో గతంలో జారీ చేసిన బిల్లుల ఆధారంగా లెక్కగట్టి కొత్తవి ఇస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు.

స్టాకు అందగానే..

స్టాకు అందగానే అందరికీ పంపిణీ చేస్తున్నామని టాన్‌జెడ్కో క్షేత్రస్థాయి

పంపిణీ చేయొచ్చన్నా..

ఒకరిద్దరు కాదు ఏకంగా రాష్ట్రంలో 1.5 లక్షల మందికి పైగా వినియోగదారుల మీటర్లు దెబ్బతిన్నాయి. వాటిలో సింగిల్ ఫేజ్‌వి 1.37 లక్షలుకాగా త్రీ ఫేజ్ మీటర్లు 18 వేల వరకు ఉన్నాయి. తమిళనాడు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీఎన్‌ఈఆర్సీ).. డిస్ట్రిబ్యూషన్ స్టాండర్డ్స్ ఆఫ్ పెర్ఫార్మెన్స్(డీఎస్‌ఓపీ) మేరకు మీటర్లు పంపిణీ చేయొచ్చని పేర్కొన్నా 80వేల మంది వినియోగదారులు మూడు నెలల నుంచి కొత్త మీటర్ల కోసం ఎదురు చూస్తున్నారు. పాడైనవాటి స్థానంలో కొత్తవి నెల రోజుల్లోగా ఏర్పాటు చేయాలని లేదంటే వినియోగదారులకు టాన్‌జెడ్కో జరిమానా అయినా చెల్లించాలని టీఈఎన్ఆర్సీ పేర్కొంది. ఈ క్రమంలో కొత్త మీటర్ల కోసం 6 6వేల పైచిలుకు మంది నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు.


డిజిటల్ విద్యుత్తు మీటర్లు

అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ మీటర్లు రానున్నాయని, కన్వెన్షనల్ మీటర్ల కొనుగోలు తగ్గించామన్నారు. ప్రస్తుతం 50 వేల మీటర్లున్నాయని, మరో లక్ష మీటర్లు కొద్ది రోజుల్లో రావాల్సి ఉందని అధికారి ఒకరన్నారు.

2023 అక్టోబరులో..

స్మార్ట్ మీటర్ల కోసం 2023 అక్టోబరులోనే టెండర్లు ఆహ్వానించినా పురోగతి లేదు. స్మార్ట్ మీటరు పథకంలో ఇప్పటికే ఉన్న డిజిటల్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేసి, పాతవి తీసుకుని, ప్రతినెలా నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్టర్లు చూడాల్సి ఉంది. స్మార్ట్ మీటర్లు ఏర్పాటైన తర్వాత నెలవారీ బిల్లులు అందించాలనేది 'టాన్‌జెడ్కో' ఆలోచనగా ఉంది. వినియోగదారులే నేరుగా బయటి వ్యక్తుల నుంచి మీటర్లు కొనుగోలు చేసుకోవచ్చన్న పథకం కూడా ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదని కొందరంటున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సుప్రియ సాహు తదితరులు

వైద్య రంగానికి ఏఐ అవసరం

వడపళని, న్యూస్‌టుడే: వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్(ఎంఐ) సదుపాయాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి సుప్రియ సాహు అన్నారు. సోమవారం జరిగిన 'సీఐఐ ఎస్సార్ డిజిటల్ హెల్త్' తుది రోజు సదస్సుకు సాహు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐ ద్వారా ఆరోగ్య సేవల అభివృద్ధికి సీఐఐ, ఆసుపత్రి నిర్వాహకులతో చేతులు కలపాలనుకుంటున్నానని సాహు అన్నారు. ఆరోగ్య మౌలిక సదుపాయాలు, వైద్య విద్యపై తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేషుగ్గా ఉన్నాయని ఐఏఎస్ సభ్య కార్యదర్శి సుధా రామన్ అన్నారు.


మాట్లాడుతున్న మంత్రి చక్రపాణి

పేదలకు ఉచితంగా ఇంటి పట్టాలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పేదలకు ఉచితంగా ఇంటి పట్టాలు అందజేస్తున్నామని ఆహారశాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. దిండుక్కల్ జిల్లాలోని ఒట్టన్ సత్రం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి జిల్లా, మండల నిర్వాహకులతో మంత్రి చక్రపాణి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల క్షేమం కోసం పలు పథకాలను ప్రకటిస్తున్నారని చెప్పారు. తమిళనాడు మరో 10ఏళ్లలో గుడిసెలు లేని రాష్ట్రంగా చేయాలనే ఉద్దేశంతో పేదలకు ఉచిత పట్టా అందించేలా 'కలైంజర్ కనవు ఇల్లం తిట్టం' ద్వారా 8 లక్షల పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అందులో ఈ ఏడాది లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో కావేరి ఉమ్మడి తాగునీటి పథక పనులు జరుగుతున్నాయన్నారు.

ఉప ముఖ్యమంత్రి అయ్యే అర్హత మరెవరికీ లేదా?

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకేలో ఉప ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉదయనిధికి తప్ప వేరెవరికీ లేదా అని అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ ప్రశ్నించారు. చెన్నైలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీలంక నావికాదళం రాష్ట్ర జాలర్లను తరచుగా అరెస్టు చేస్తోందని తెలిపారు. దీంతో వారి జీవనోపాధి దెబ్బతింటుందని అన్నారు. జాలర్ల పట్ల డీఎంకే ప్రభుత్వానికి దిగులు లేదని తెలిపారు. డీఎంకే శంకరమఠం కాదని దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి ఓ సందర్భంలో చెప్పారని గుర్తు చేశారు. డీఎంకే పార్టీ అభివృద్ధికి పాటు పడిన వారికి ఉప ముఖ్యమంత్రి పదవి లేదా అని ప్రశ్నించారు. డీఎంకేలో పలువురు సీనియర్ నేతలు ఉండగా ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు ప్రయత్నం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి అయ్యే అర్హత డీఎంకేలో వేరెవరికీ లేదా అని ప్రశ్నించారు.

తిరుత్తణి మురుగన్ ఆలయంలో యోగిబాబు


యోగిబాబుతో సెల్ఫీలు దిగుతున్న భక్తులు

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయంలో హాస్యనటుడు యోగిబాబు మంగళవారం స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పలికి ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం మత్తూర్ మహిషాసురమర్దిని ఆలయంలో జ్యోతి వెలిగించి దర్శించుకున్నారు. భక్తులు యోగిబాబుతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.


అధికారులతో మంత్రి ముత్తుసామి తదితరులు

మూసివేసే టాస్మాక్ దుకాణాల జాబితా త్వరలో వెల్లడిస్తాం: మంత్రి ముత్తుసామి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మూసివేయనున్న టాస్మాక్ దుకాణాల వివరాలు సేకరిస్తున్నామని, త్వరలో జాబితా ప్రకటిస్తామని గృహ నిర్మాణ, ప్రొహిబిషన్ శాఖ మంత్రి సు ముత్తుసామి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఈరోడ్ ముత్తంపాళయం ప్రాంతంలోని పెరుంపళ్లం వాగులో గాలి కుమలం తొలగింపు పనులను ప్రారంభించి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... టాస్మాక్ దుకాణాలను మూసివేయడంపై తమకు విభేదాలు లేవన్నారు. ఒక్క రోజులో మూతబడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. అందువల్ల క్రమేణా మూసివేయడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. టాస్మాక్ దుకాణాల జాబితా సేకరిస్తుంటే విక్రయం పెంచడానికి తప్పుగా అనుకుంటున్నారని వాపోయారు. జాతీయ స్థాయిలో మద్యం దుకాణాలను మూసేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటే రాష్ట్రం సహకరిస్తుందని చెప్పారు.

డెంగీ, గన్యా నివారణకు చర్యలు తీసుకోండి: ప్రతిపక్షనేత శివ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో పెరుగుతున్న డెంగీ, గున్యా వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు ఆరోగ్యశాఖ నిర్లక్ష్యమేనని ప్రతిపక్షనేత శివ ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... నేటి వరకు పుదుచ్చేరి, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 500 మందికి పైగా డెంగీ, 200 మంది గున్యా బారినపడ్డారని తెలిపారు. దీంతో నగరం, గ్రామాల్లోని ఆస్పత్రుల్లో రోగులు పెరిగి ప్రజల్లో భయాందోళన గురిచేసిందన్నారు. దీనికి ఆరోగ్యశాఖ నిర్లక్ష్యమే కారణమన్నారు. ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్రీరాములు పదవి కాలం ముగిసి వారాలవుతున్నా కొత్త డైరెక్టర్‌ను నియమించలేదన్నారు. ముఖ్యమంత్రి చర్యలు తీసుకుని వెంటనే డైరెక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ఉత్తుకోట: ఉత్తుకోటలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలల్లో 11వ తరగతి చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సైకిళ్లు అందజేసే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గోవిందరాజన్ ముఖ్య అతిథిగా హాజరై 300 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. డీఎంకే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూర్తి, సర్వ సభ్య సభ్యులు అభిరామి, పట్టణ పంచాయతీ అధ్యక్షుడు అబ్దుల్‌రషీద్, ఉపాధ్యక్షుడు కుమరవేల్ పాల్గొన్నారు.

10 లక్షల ఎకరాల్లో

మొక్కజొన్న సాగు లక్ష్యం



విల్లివాక్కం, న్యూస్‌టుడే: వరి, చెరకు, పత్తి పంటల సాగుకు ప్రత్యామ్నాయంగా సాగుచేస్తున్న మొక్కజొన్న పంట రైతులకు అధిక ఆదాయం తెచ్చిపెడుతోంది. మొక్కజొన్న సాగును పెంచుతున్న నేపథ్యంలో ఉత్పత్తి వాడకం తగ్గ లేదు. దీంతో మొక్కజొన్న సాగును ప్రోత్సహించే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. మొక్కజొన్న సాగుచేస్తున్న 18 జిల్లాల్లో రూ.30 కోట్లతో పథకాన్ని అమలు చేయనుంది. ఈ నిధులతో రూ.6 వేల విలువైన విత్తనాలు, వివిధ రకాల ఎరువులను 50 వేల మంది రైతులకు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది. ఈ ఏడాది మొక్కజొన్న సాగు 10.1 లక్షల ఎకరాల్లో చేయడానికి చర్యలు చేపట్టింది. జిల్లాల వారీగా సాగు లక్ష్యాలు ఇలా.. పెరంబలూర్ జిల్లాలో 1.63 లక్షలు, తూత్తుక్కుడిలో 1.26 లక్షలు, సేలంలో 97,903, దిండిగల్లులో 72,590, కడలూర్‌లో 60,591 ఎకరాల్లో సాగుబడి లక్ష్యం నిర్ణయించినట్లు ఓ అధికారి తెలిపారు. తిరువారూర్, రాణిపేట, మైలాడుదుర్రై, నాగపట్నం, కన్యాకుమారి, చెంగల్పట్టు జిల్లాలకు లక్ష్యం నిర్ణయించలేదని వివరించారు.


కాంచీపురం కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రజా వేదిక భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రూ.52.48 లక్షల విలువైన సంక్షేమ సాయాలను అందజేస్తున్న రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్. చిత్రంలో కలెక్టరు కలైసెల్వి, ఎంపీ జీసెల్వం, ఎమ్మెల్యేలు ఎళిలరసన్, కె.సుందర్ తదితరులు - కాంచీపురం, న్యూస్‌టుడే



చెన్నైలో తమిళనాడు ఉన్నత విద్యా శాఖ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తరఫున కాంచీపురం ఏనాత్తూర్‌లోని శ్రీ శంకర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పని చేస్తున్న మైక్రో బయాలజీ శాస్త్రవేత్త ఆర్.బాల గురునాథన్ సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి కె.పొన్ముడి చేతుల మీదుగా అవార్డు అందుకొంటున్న దృశ్యం - కాంచీపురం, న్యూస్‌టుడే

దేవాదాయ భూముల స్వాధీనం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సేలం జిల్లా ఎడప్పాడి తాలూకా వెల్లగౌండనూర్‌లోని వరదరాజ పెరుమాళ్ ఆలయానికి వెళ్లరి గ్రామంలో 9.27 ఎకరాల భూములు ఉన్నాయి. ఓ ప్రైవేటు వ్యక్తి ఆక్రమించి 12,675 చదరపు అడుగుల విస్తీర్ణంలో కల్యాణ మంటపాన్ని నిర్మించారు. ఈ ఆక్రమణలు తొలగించడానికి మద్రాస్ హైకోర్టులో సేలం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.రాజా పిటిషన్ దాఖలు చేశారు. కల్యాణ మంటపాన్ని కూలదోయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో, పోలీసుల బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలగించారు. స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.15 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఏనుగు దాడిలో రైతు మృతి

బంధువుల రాస్తారోకో

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఏనుగు దాడిలో రైతులు ప్రాణాలు కోల్పోయారు. ధర్మపురి జిల్లా పాలక్కోడు సమీపంలోని కోడప్పట్టి ప్రాంతానికి చెందిన రైతు దురైసామి(68) వేరుసెనగ తోటకు కావలి ఉన్నారు. సోమవారం ఉదయం అక్కడికి వచ్చిన ఏనుగు ఆయనపై దాడికి పాల్పడటంతో మృతి చెందారు. ఆగ్రహించిన బంధువులు మృతదేహంతో సెంగోటోట్టైలో రాస్తారోకో చేపట్టారు. ఇదే ఏనుగు ఇటీవల తీత్తారపట్టిలో ఓ వృద్ధుడిని తొక్కి చంపడం గమనార్హం. ఏనుగు సంచారం తెలిసినా అడవిలోకి తరమకుండా అటవీశాఖ నిర్లక్ష్య వైఖరి వహిస్తోందని ఆరోపించారు. పాలక్కోడు పోలీసులు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.



జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి గాంధీ

వ్యాపారులకు జ్ఞాపికల పంపిణీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు బసవనగుడి పాయ్ విస్తా మండపంలో రాష్ట్ర ప్రభుత్వ చేనేత శాఖ తరఫున సోమవారం విక్రయ, వినియోగదారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్ గాంధీ చేనేత ఉత్పత్తి రకాలను అధికంగా కొనుగోలు చేసిన వ్యాపారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చేనేత శాఖ సంచాలకుడు షణ్ముగసుందరం, కో-ఆప్‌టెక్స్ ఎండీ దీపక్ జాకబ్, కేంద్ర పట్టు బోర్డు సభ్యుడు, కార్యదర్శి, సీఈఓ శివకుమార్, నిఫ్ట్ సంచాలకుడు డాక్టర్ యతీంద్ర లఖానా, కర్ణాటక ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ సంయుక్త సంచాలకుడు యోగేష్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ప్రారంభం


నైపుణ్య పోటీల్లో విజయం సాధించిన వారితో ఉదయనిధి

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై అన్నానగర్‌లో సివిల్ సర్వీస్ పరీక్షకు కోచింగ్ సెంటర్‌ను చెన్నై అన్నా శతాబ్ది గ్రంథాలయంలో రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి, ప్రత్యేక పనుల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. అలాగే తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ తరఫున పోటీ పరీక్షలకైన వసతి గృహంతో కూడిన శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తమిళనాడు, భారత నైపుణ్య పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహ నిధి, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ మంత్రి మెయ్యనాథన్, ప్రత్యేక పథకాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి తారేష్ అహ్మద్, తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్నసెంట్ దివ్య తదితరులు పాల్గొన్నారు.



చెరువుకు చేరుకుంటున్న జలాలు

పూండికి కండలేరు జలాలు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తెలుగుగంగ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు సమీప కండలేరు జలాశయం నుంచి పూండి చెరువుకు ఈనెల 19న నీటిని విడుదల చేశారు. ఈ నీరు 152 కిలోమీటర్ల ప్రవహించి రాష్ట్ర సరిహద్దులోని ఊత్తుకోట సమీప తామరైకుప్పం జీరో పాయింట్‌కు సోమవారం ఉదయం చేరుకుంది. రాష్ట్ర నీటి వనరులశాఖ అధికారులు పూలు చల్లి నీటిని ఆహ్వానించారు. ఈ నీరు 25 కిలోమీటర్ల దూరం ప్రవహించి మంగళవారం వేకువ జామున 3 గంటలకు పూండి చెరువుకు చేరుకుంది.

మాజీ మంత్రిపై అనిశా కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఉద్యోగం ఇప్పిస్తానని రూ.65 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడిన కేసులో అన్నాడీఎంకే మాజీ మంత్రి సుబ్రమణియన్, ఆయన కుమార్తెపై అవినీతి నిరోధకశాఖ(అనిశా) కేసు నమోదు చేసింది. సేలం అస్తంపట్టికి చెందిన మునుసామి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. 2011-2016 వరకు అన్నాడీఎంకే హయాంలో ఆదిద్రావిడ సంక్షేమశాఖ మంత్రిగా ఉన్న సుబ్రమణియన్‌తో తనకు పరిచయం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వంటమనిషి పోస్టులు భర్తీ చేస్తున్నట్లు, రూ.3 లక్షలు ఇస్తే నియామక ఉత్తర్వు ఇప్పిస్తానని మాజీ మంత్రి సుబ్రమణియన్ తెలిపారన్నారు. అది నమ్మి 20 మంది వద్ద రూ.65 లక్షలు వసూలు ఇచ్చానని, ఉద్యోగం ఇప్పించ లేదన్నారు. అనంతరం రూ.23 లక్షల తిరిగిచ్చారని, మిగిలినది ఇస్తానని పుదుక్కోట్టైకి రప్పించారనన్నారు. సుబ్రమణియన్, ఆయన కుమార్తె లావణ్య తనపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును అనిశాకు బదిలీ చేస్తూ డీజీపీ శంకర్‌జివాల్ ఉత్తర్వులు ఇచ్చారు. సుబ్రమణియన్, లావణ్యలపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.



హిందీ ఉపాధ్యాయినికి జ్ఞాపిక అందిస్తున్న శ్రీనివాసనాయక్

హిందీ పోటీలు

వడపళని, న్యూస్‌టుడే: కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్(సీడీఏ) ఆధ్వర్యంలో 15 రోజుల హిందీ పోటీలు మంగళవారం జరిగాయి. చెన్నై ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్, ఆర్.శ్రీనివాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు, హిందీ టీచర్లకు బహుమతులు అందజేశారు. ఈ మేరకు రక్షణ శాఖ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీభవ్య

దీపావళికి రాయితీ విక్రయాలు ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఊటీ చేరింగ్‌క్రాస్ ప్రాంతంలోని కో-ఆప్‌టెక్స్ విక్రయ కేంద్రంలో దీపావళి ప్రత్యేక రాయితీ విక్రయాలను నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సరికొత్త డిజైన్‌లలో చీరలు, ఇతర వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తోడర్ తెగ రూపొందించిన ఎంబ్రాయిడరీ శాలువాలు అమ్మకానికి ఉన్నాయని తెలిపారు.

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై తిరుమంజనగోపురం వీధిలో ఉన్న పున్నమి కోఆప్‌టెక్స్ దీపావళి 2024 ప్రత్యేక విక్రయ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. స్థానిక జిల్లా కలెక్టరు భాస్కరపాండియన్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి దీపావళి విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ విక్రయించే కాటన్ వస్త్రాలకు 30 శాతం ప్రత్యేక రాయితీ ఇస్తారు. ప్రభుత్వ సిబ్బందికి రాయితీతో పాటు రుణంగా విక్రయించబడును. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత సహాయక డైరెక్టర్ ఎస్.కార్తికేయన్, కో-ఆప్‌టెక్స్ మేనేజర్లు జ్ఞానప్రకాశం, ధనపాల్ పాల్గొన్నారు.



విద్యార్థితో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

ఎస్‌కేపీడీ విద్యార్థికి అభినందన

టీనగర్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి 'ఇన్‌స్పైర్ మనక్' పురస్కారాన్ని అందుకున్న ఎస్‌కేపీడీ పాఠశాల విద్యార్థి పులగాల త్రినాథ్‌కు సోమవారం చెన్నై షావుకారుపేటలోని బడి ఆవరణలో అభినందన సభ జరిగింది. కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం, ప్రధానోపాధ్యాయులు ఓరుగంటి లీలారాణి, ఉపాధ్యాయులు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నటి సిల్క్‌స్మిత వర్ధంతి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నటి సిల్క్‌స్మిత వర్ధంతిని ఆమె వీరాభిమాని, ఈరోడ్‌లోని కుమార్ అనే టీ దుకాణ యజమాని నిర్వహించారు. ఏటా సిల్క్‌స్మిత జయంతి, వర్ధంతి రోజుల్లో అనాథలకు సాయం అందిస్తున్నారు. సోమవారం ఆమె వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి మాలవేసి పుష్పాంజలి ఘటించారు. 25 మంది అనాథలకు భోజనం అందించారు.


చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న టీ దుకాణ యజమాని కుమార్ తదితరులు

సీతారాం ఏచూరి మార్గంలో పయనిద్దాం: ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: సమధర్మ ఇండియా నిర్మాణానికి సీపీఎం దివంగత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నడిచిన మార్గంలో పయనిద్దామంటూ డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి చిత్రపట ఆవిష్కరణ, సంస్మరణ కార్యక్రమం తేనాంపేటలోని కామరాజర్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్టాలిన్ మాట్లాడుతూ... సీతారాం ఏచూరి అందరివాడని, ఆ విధంగానే జీవించారని తెలిపారు. భారతదేశ భావజాలానికి ఓ గుర్తుగా ఉన్న ఆయన మృతితో ఆ భావజాలానికి తీరని లోటు కలిగిందన్నారు. కూటమి చర్చల సందర్భంగా రాష్ట్రంలోని ఇతర పార్టీల నేతలు విభేదించినా వారితో సఖ్యతగా మాట్లాడి సుముఖంగా పరిష్కరించేవారని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని కమ్యూనిస్టుల కోటగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. యువ సమాజానికి మార్గదర్శిగా జీవించారని, కమ్యూనిస్టు భావజాలాన్ని తుదిశ్వాస వరకు ఆచరించారని తెలిపారు. 1996 తర్వాత కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించడం వెనుక సీతారాం ఏచూరి కూడా ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం 'ఇండియా' కూటమి ఏర్పాటు వెనుక కూడా ఆయన పాత్ర ఉందన్నారు. జాతీయ రాజకీయాల తీరు రాష్ట్ర ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో 'తీకదిర్' వారపత్రికలో డైరీలాగా కొన్ని విషయాలను రాశారన్నారు. కార్యక్రమంలో ద్రావిడర్ కళగం అధ్యక్షుడు కె.వీరమణి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ ధావ్లే, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్, హిందూ గ్రూపు డైరెక్టర్ ఎన్.రాం, 'ఇండియా' కూటమి పార్టీల నేతలు వైగో, సెల్వ పెరుంతగై, ముత్తరసన్, తిరుమావళవన్, ఖాదర్ మొహిదీన్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఒకే నెంబరు.. 4 ఆమ్నీ బస్సులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఉళుందూర్‌పేట వద్ద మంగళవారం ఆర్టీఓ నిర్వహించిన తనిఖీల్లో ఒకే రంగు, ఒకే మోడల్, ఒకే నంబరుతో నడుస్తున్న ఆమ్నీ బస్సులను స్వాధీనం చేసుకున్నారు. కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలో ఆర్టీఓ రాజ్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. పీవై05.జె.3485 నంబరు రిజిస్ట్రేషన్‌తో, ఒకే రంగులో ఉన్న నాలుగు ఆమ్నీ బస్సులను గుర్తించారు. రోడ్డు పన్ను చెల్లించకుండా బస్సులను ఒకే నెంబరుతో నడుపుతున్నట్లు గుర్తించారు. ప్రయాణికులను దింపేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



స్వాధీనం చేసుకున్న బస్సుతో ఆర్టీఓ



కన్నిమూల గణపతి ఆలయంలో, ఇళ్ల వద్ద దీపాలు వెలిగించిన భక్తులు

తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారం..

దోషం తొలగాలని పూజలు

చెన్నై(టీనగర్), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో ఏర్పడిన అపచారం కారణంగా ఎలాంటి అరిష్టాలు జరగకుండా తమిళనాడులోని తిరునెల్వేలి భక్తులు సోమవారం రాత్రి పూజలు చేశారు. అక్కడి బాలాజీ నగర్, ఇంద్రానగర్ కాలనీల్లో అనేకమంది శ్రీవారి భక్తులు నివసిస్తున్నారు. తమ ఇళ్ల ప్రహరీలపై దీపాలు వెలిగించారు. ఇళ్లల్లోనూ పరిహార పూజలు చేశారు. అక్కడి కన్నిమూల గణపతి ఆలయంలో దీపాలు వెలిగించి ప్రార్థనలు చేశారు. ఆలయ పూజారి మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తులను తీవ్రంగా మనోవేదనకు గురి చేసిందన్నారు. పరిహారానికి ఇళ్లల్లో దీపాలు వెలిగించి, ఆలయంలో పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

నియంత్రణలో డెంగీ: మంత్రి మా.సుబ్రమణియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డెంగీ నియంత్రణలోనే ఉందని ఆరోగ్య శాఖ మంత్రి మా. సుబ్రమణియన్ తెలిపారు. చెన్నై చిన్నపోరూర్ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో 1480 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను మంత్రి అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో డెంగీ జ్వరం నియంత్రణలో ఉందన్నారు. ఈ ఏడాదిలో డెంగీ జ్వరానికి ఇప్పటివరకు ఐదుగురు మాత్రమే మృతి చెందారన్నారు. రాష్ట్రంలో నిపా వైరస్ వ్యాప్తి లేదన్నారు. కేరళ-తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లో ఆరోగ్యశాఖ కఠినంగా తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మంకీ పాక్స్ గురించి పూర్తి దేహ ఉష్ణోగ్రత పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మంకీ పాక్స్ వ్యాధికి రాష్ట్రంలో ప్రత్యేక వార్డులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

సినీ దర్శకుడిని విడుదల చేయాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: సినీ దర్శకుడు మోహన్‌ను వెంటనే విడుదల చేయాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఎలాంటి నేరం చేయకపోయినా అరెస్టయ్యారని, ఎందుకు అరెస్టు చేశారో పోలీసులు చెప్పలేదన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ విక్రేతలను అరెస్టు చేయని ప్రభుత్వం చిలుక జోస్యం చెప్పేవారిని, సామాజిక మాధ్యమాల్లో మాట్లాడేవారిని జైల్లో పెడుతోందని మండిపడ్డారు.

రేస్‌క్లబ్‌ను నీటివనరుగా మార్చడం వీలవదు: ప్రభుత్వం స్పష్టీకరణ

ప్యారిస్, న్యూస్‌టుడే: గిండి రేస్‌క్లబ్‌ను నీటి వనరుగా మార్చేందుకు సాధ్యం కాదని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వేళచ్చేరి చెరువు రక్షణ ఉద్యమం తరపున దాఖలైన పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ.. రేస్ కోర్స్ మైదానాన్ని నీటి వనరుగా మార్చేందుకు వీలవుతుందా అన్న విషయమై వివరణ ఇవ్వాలని కోరింది. వేళచ్చేరి చుట్టుపక్కల నీటివనరులు లేవని, ఇది వరికే ఉన్న ప్రాంతాలను ప్రభుత్వ ఉపయోగానికి తీసుకున్నట్లు ప్రభుత్వం తరపున తెలిపారు. సుమారు 265 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వేళచ్చేరి చెరువులో 53 ఎకరాలు హౌసింగ్ బోర్డుకు, స్లమ్ క్లియరెన్స్ బోర్డుకు 140 ఎకరాలు, ప్రైవేటు ఆక్రమణలు 18 ఎకరాలు కాగా ప్రస్తుతం మిగిలింది 55 ఎకరాలు మాత్రమే నీటి వనరుగా ఉందన్నారు. 1938 మ్యాప్ ప్రకారం వాననీరు వేళచ్చేరి నుంచి పళ్లికరణై చిత్తడి నేలకు, అక్కడి నుంచి ఒక్కియం తురైప్పాక్కం వైపుగా బకింగ్‌హామ్ కాలువకు వెళ్తుందన్నారు. కొత్తగా గిండి రేస్‌క్లబ్‌ను నీటివనరుగా మార్చేందుకు భౌగోళికంగా ఆచరణ సాధ్యం కాదన్నారు. అనంతరం ట్రైబ్యునల్.. చిత్తడి నేలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టేందుకు జీవో జారీచేసిన ప్రభుత్వం, నీటి వనరు ఏర్పాటుకు ఎందుకు సంకోచిస్తుందని ప్రశ్నించింది. వేళచ్చేరి పక్కనే స్థలం ఉన్నప్పుడు ఎందుకు సంకోచిస్తున్నారని తెలిపింది. నీటి వనరుల్లో ఇకపై ఎలాంటి నిర్మాణానికి అనుమతించరని పేర్కొంది. అక్కడి ప్రభుత్వ నిర్మాణాలను మరో ప్రాంతానికి మార్చేందుకు సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చి, విచారణను అక్టోబరు 14కి వాయిదా వేసింది.

మంత్రివర్గ మార్పుతో

దురైమురుగన్‌కు నిరాశ

తమిళిసై సౌందరరాజన్

సైదాపేట, న్యూస్‌టుడే: ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి అనేది దురైమురుగన్‌కు నిరాశ కలిగించే విషయమని తమిళనాడు భాజపా మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వటంపై డీఎంకే ఆలోచనలు సాగిస్తోంది. త్వరలో ప్రకటన వస్తుందని డీఎంకే మంత్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమిళిసై సౌందరరాజన్ మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ... మంత్రివర్గ మార్పు ఉదయనిధికి సంతోషాన్ని, దురైమురుగన్‌కు నిరాశను మిగల్చనుందన్నారు. దురైమురుగన్‌లా పలువురు డీఎంకే నేతలు కూడా నిరాశ చెందుతారని అన్నారు. వారసత్వ రాజకీయాల ద్వారా పదవుల్లోకి రావటం ప్రభుత్వానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. డీఎంకే పాలనలో ఎన్‌కౌంటర్‌లు పెరిగాయని, ఇంతవరకు 17 జరిగాయని ఆరోపించారు. ఎవరిని కాపాడేందుకు ఈ ఎన్‌కౌంటర్‌లు అని ప్రశ్నించారు. శాంతిభద్రతలు క్షీణించాయని అన్నారు. లైంగిక నేరాలు, మత్తుపదార్థాల వినియోగం పెరిగాయని పేర్కొన్నారు.



కాశిమేడు హార్బర్‌లో విక్రయానికి వచ్చిన చేపలు

మాంసం విక్రయాలపై పెరటాసి ప్రభావం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పవిత్రంగా భావించే పెరటాసి మాసంలో చాలా మంది హిందువులు మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ క్రమంలో పెరటాసి మాస మొదటి ఆదివారం మాంసం విక్రయాలు మందగించాయి. ఆదివారం కాశిమేడులో కొనుగోలుదారులు తక్కువగా ఉండటంతో చేపల ధరలు కూడా బాగా తగ్గాయి. గత వారం వంజరం చేప కిలో రూ.1000 పలుకగా ఆదివారం రూ.850కు తగ్గింది. చింతాద్రిపేట మార్కెట్‌లో కూడా ఇదే పరిస్థితి.

కొడైకెనాల్‌కు పెరిగిన పర్యాటకులు

ఆర్కేనగర్: దిండుక్కల్ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొడైకెనాల్‌కు ఈ వారం కేరళ, కర్ణాటక, ఆంధ్రా నుంచి పర్యాటకుల రాక పెరిగింది. కొడైకెనాల్‌లో ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో అధికంగా విచ్చేస్తున్నారు. బ్రయాంట్ పార్క్ సందర్శిస్తూ, బోట్ షికారు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు.



బోట్ షికారులో పర్యాటకులు

రహదారుల పనులపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: రహదారుల పనులపై చెన్నై సచివాలయంలో మంత్రి ఏవీ వేలు అధ్యక్షతన సమీక్ష జరిగింది. రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారుల పనుల పరిస్థితిని తెలుసుకున్నారు. జాప్యానికి కారణాలపై ఆరా తీశారు. పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి ఏవీ వేలును జాతీయ రహదారుల కమిషన్ చెన్నై మండల అధికారి వీరేంద్రసాంబియాల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మరింత త్వరగా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ

వడపళని, న్యూస్‌టుడే: తరచూ విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం, ఇమ్మిగ్రేషన్ తనిఖీల కోసం వేచి ఉండకుండా చెన్నై విమానాశ్రయంలో ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం(టీటీపీ)లో భాగంగా ఫాస్ట్రాక్ సిస్టమ్‌ను త్వరలో అందుబాటులోకి తేనుంది. ఈ విధానం కింద నమోదు చేసుకున్న ప్రయాణికులు పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్‌లను ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం స్కాన్ చేయాల్సి ఉంటుంది. విమానాలు బయలుదేరే, వచ్చి చేరే టెర్మినళ్లలో మొత్తం ఎనిమిది ప్రవేశద్వారాలున్నాయి. రెండు విమానాశ్రయాలకు కనెక్టివిటీ పనులు పూర్తి కావాల్సి ఉందని, మరో వారంలోగా పూర్తవుతాయని అధికారులన్నారు. ఈ పద్ధతి తొలిసారి న్యూదిల్లీలోని ఐజీఐ విమానాశ్రయంలో జూన్‌లో ప్రారంభమైంది. మరో ఏడు చోట్ల కూడా ప్రవేశపెట్టాలని అధికారులు నిర్ణయించారు. అందులో చెన్నై ఒకటి. ఇందుకు అర్హులైన ప్రయాణికులు నుంగంబాక్కంలోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్ఆర్ఆర్ఓ)లో నమోదు చేసుకున్నారని, స్పందన కూడా బాగానే కనిపిస్తోందని ఇమ్మిగ్రేషన్ అధికారులు పేర్కొన్నారు. తరచూ విదేశాలకు వెళ్లే వారు సంబంధిత పత్రాలు, వేలిముద్రలు, ముఖ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించాక 'ట్రస్టెడ్ ట్రావెలర్స్'గా గుర్తింపు పొందుతారు. రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని ఇమ్మిగ్రేషన్ కార్యాలయం వరకు వెళ్లకుండా చెన్నై విమానాశ్రయంలోనే ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు ప్రయాణికులు సూచించారు.



ఇమ్మిగ్రేషన్ విభాగం వద్ద ప్రయాణికులు



మంత్రి సీవీ గణేశన్, అధికారులు

త్వరలో విశ్రాంత గృహాలు ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై, మామల్లపురం, కుట్రాలం, వాల్పారైలలో పునరుద్ధరించిన విశ్రాంతి గృహాలు త్వరలో ప్రారంభిస్తామని కార్మిక సంక్షేమ, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి సీవీ గణేశన్ తెలిపారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్మిక సంక్షేమ బోర్డు 80వ సమావేశం మంగళవారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ... మూడేళ్లలో తమిళనాడు కార్మిక సంక్షేమం తరపున 30,134 మంది కార్మికులకు రూ.12.54 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందించినట్లు పేర్కొన్నారు. వివాహ సహాయ నిధిగా 3,264 మంది లబ్ధిదారులకు రూ.4,27,75,000 ఇచ్చినట్లు చెప్పారు. రూ.10 వేలుగా ఉన్న వివాహ సహాయ నిధిని గతేడాది ఏప్రిల్ నుంచి రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు.

సబర్బన్ సర్వీసుల్లో మార్పులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్, అరక్కోణం సెక్షనులోని ఆవడి యార్డులో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా 25, 26, 27 తేదీల్లో కొన్ని సబర్బన్ సర్వీసులు పూర్తిగా, పాక్షికంగా రద్దయినట్లు దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది.

- మూర్ మార్కెట్ కాంప్లెక్సు(ఎంఎంసీ)- ఆవడి అర్ధరాత్రి 12.15 రైలు బుధ, గురు, శుక్రవారాలు రద్దయింది.
- పట్టాభిరాం మిలిటరీ సైడింగ్-ఎంఎంసీ 22.45, 03.30 సర్వీసులు బుధ, గురు, శుక్రవారాలు ఆవడి వరకు నడుస్తాయి.

విద్యార్థినిపై అత్యాచారం అవాస్తవం

దిండుక్కల్ పోలీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తనపై నలుగురు అత్యాచారానికి పాల్పడ్డారని ఓ నర్సింగ్ విద్యార్థిని చేసిన ఆరోపణల్లో నిజం లేదని దిండుక్కల్ పోలీసులు తెలిపారు. తేని జిల్లాకు చెందిన నర్సింగ్ విద్యార్థిని గుర్తుతెలియని నలుగురు తనను కారులో అపహరించి అత్యాచారానికి పాల్పడి దిండుక్కల్ రైల్వేస్టేషన్‌లో వదిలి వెళ్లారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. బాధితురాలిని మహిళా పోలీసులు, దిండుక్కల్ ఎస్పీ వేర్వేరుగా విచారించారు. కారులో వచ్చిన యువకుల గురించి గాలించారు. ఇదిలా ఉండగా ఆ విద్యార్థిని చెప్పినట్లు ఎలాంటి అపహరణ, అత్యాచారం ఘటన జరగలేదని, ఆమెకు ఉన్న మానసిక ఒత్తిడి కారణంగానే తప్పుడు ఫిర్యాదు చేసిందని దిండుక్కల్ జిల్లా పోలీసుశాఖ తెలిపింది.

టీవీకే కార్యకర్తలకు విజయ్ సూచనలు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం తొలి రాష్ట్ర మహానాడు విళుపురం జిల్లా విక్రవాండి వద్ద జరగనున్న నేపథ్యంలో కార్యకర్తలకు కీలకమైన 10 సూచనలను పార్టీ అధ్యక్షుడైన నటుడు విజయ్ అందించారు. ఆ మేరకు... మద్యం తాగి మహానాడు ప్రాంతానికి రాకూడదని, మహానాడు ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని, రైలు పట్టాలు, బావులువంటి ప్రమాదకరమైన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలిగించకూడదని, మహిళలు, మహిళా పోలీసులకు తగిన భద్రత కల్పించాలని, అధికారుల వద్ద మర్యాదగా ప్రవర్తించాలని, వైద్య బృందం, అగ్నిమాపకశాఖకు తగిన వసతులు కల్పించాలని, వాహనాల్లో వేగంగా, సాహసాలు చేసేలా వెళ్లకూడదని, నాలుగు చక్రాల వాహనాల్లో వచ్చే కార్యకర్తలు వాటికి వేలాడుతూ రాకూడదని సూచించారు.

కీళ్‌భవాని కాలువ నుంచి నీటి చౌర్యం



తూము పరిశీలిస్తున్న అధికారులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కీళ్‌భవాని కాలువ నుంచి ఆయకట్టుకు సాగునీరు అందని రైతులు రహస్యంగా హోస్ పైపుల ద్వారా రాత్రి సమయాలలో నీరు వినియోగిస్తున్నట్టు ప్రజాపనుల శాఖకు ఫిర్యాదులు అందాయి. నీటి చౌర్యం కారణంగా ఔట్‌లెట్ రైతులకు సరిపడా నీరు అందట్లేదు. దీంతో జలవనరుల శాఖ కవుందంబాడి అసిస్టెంట్ ఇంజినీరు సెంథిల్‌కుమార్, గోపి వెస్ట్ అసిస్టెంట్ ఇంజినీరు దినేష్, లస్కర్లు, ఇతర సిబ్బంది కాలువ ప్రాంతంలో గస్తీ తిరిగారు. అప్పుడు గోపి సమీప వెల్లాంకోవిల్ 39వ మైలు ప్రాంతంలో పెద్ద హోస్ పైపుల ద్వారా పొలాలకు నీరు సరఫరా చేయడాన్ని గుర్తించారు. దీంతో అధికారులు ఆ పైపులను తొలగించారు.

భర్త మృతితో భార్య బలవన్మరణం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఆవడి సమీప ఆరిక్కంబేడు పెరుమాల్ ఆలయ వీధికి చెందిన రైతు కూలీ మురళికి నర్మద(32)తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. దీంతో మురళి ఈనెల 20న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి దిగాలుగా కనిపించిన నర్మద సోమవారం రాత్రి పడక గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. ఆవడి ట్యాంక్ ఫ్యాక్టరీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నర్మద (పాతచిత్రం)

విద్యుదాఘాతంతో అక్కా తమ్ముళ్ల మృతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన అక్క విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన తిరువారూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరువారూర్ జిల్లా వలంగైమాన్ ప్రాంతానికి చెందిన గురుమూర్తి(42) తమిళనాడు విద్యుత్‌బోర్డులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అరియమంగలంలో విద్యుత్తు సరఫరా ఆగిపోవడంతో విద్యుత్ బోర్డుకు సమాచారం ఇచ్చారు. మరమ్మతు చేసేందుకు వెళ్లిన గురుమూర్తి విద్యుత్తు స్తంభం ఎక్కి సరిచేస్తున్న సమయంలో షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అతని అంత్యక్రియల కోసం మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచారు. సోదరి సుందరి(50)తో పాటు బంధువులు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఇదిలా ఉండగా ఫ్రీజర్ బాక్స్ నుంచి షార్ట్ సర్క్యూట్ జరిగి పక్కనే కూర్చొని ఏడుస్తున్న సుందరితో పాటు ఏడుగురికి విద్యుత్తు షాక్ తగిలింది. అందులో సుందరి అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరి దుర్మరణం

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: ఆర్‌కేపేట సమీపం వెడియంగాడు పుదూర్ గ్రామానికి చెందిన మహేంద్రన్(64) వంద రోజుల పనుల కోసం పొన్నై సమీపం కీరైసాత్తు గ్రామానికి మంగళవారం తన ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఆర్‌కేపేటలోని మాంసం దుకాణంలో పనిచేస్తున్న వేలూరు జిల్లా కాట్పాడికి చెందిన హుస్సేన్(24) తన గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో ఆర్‌కేపేటకు బయలుదేరాడు. దారిలో వెడియంగాడు పుదూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘం ఎదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహేంద్రన్, హుస్సేన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆర్‌కేపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హుస్సేన్, మహేంద్రన్ (పాతచిత్రాలు)

ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పూర్ ఊత్తుకులిరోడ ఆనైక్కాడు ప్రాంతంలోని మూడు అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో సురేష్(35) భార్య విజి(29), కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. ఇతను టీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం వీరు ఉంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లి చూడగా హాల్‌లో భార్య, గదిలో భర్త, కుమార్తె శవాలుగా కనిపించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించి విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

17 ఏళ్ల బాలుడితో సహజీవనం చేసిన యువతి..

మహాబలిపురం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన 24 ఏళ్ల యువతి పశ్చిమ తాంబరంలోని ఓ బట్టల దుకాణంలో పని చేసేది. అదే షాపులో పనిచేస్తున్న 17 ఏళ్ల బాలుడితో పరిచయం ఏర్పడింది. తాంబరం రంగనాథపురం వీధిలో ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తూ వచ్చారు. మూడు రోజుల కిందట యువతి బాలుడితో కలిసి బయటకెళ్లి ఆదివారం రాత్రి తిరిగొచ్చింది. ఆ ఇంట్లో నుంచి సోమవారం రాత్రి దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగు వారు తాంబరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు పగులగొట్టి లోనికెళ్లగా యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని క్రోంపేట ఆసుపత్రికి తరలించి సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకొన్నారు.

అన్నాడీఎంకే నేత ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి

ప్యారిస్, న్యూస్‌టుడే: తేని జిల్లా చిన్నమనూర్ అన్నాడీఎంకే నగర కార్యదర్శి పిచ్చైక్కని ఇల్లు, కార్యాలయం కుముళి వెళ్లే హైవే వద్ద ఉంది. అతని ఇంటి సెక్యూరిటీగా మారిముత్తు పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి అతని ఇంటిపై ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు పెట్రోల్ బాంబులు విసిరి పారిపోయారు. శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న పిచ్చైక్కని కుటుంబీకులు బయటకు వచ్చారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణాలను ధ్వంసం చేసిన ఏనుగు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై జిల్లా పూండి ప్రాంతంలో దక్షిణ కైలాసం అని పిలువబడే వెల్లయంగిరి కొండ ఉంది. ఈ కొండపైకి వెళ్లడానికి ఏడాదిలో మార్చి నుంచి మే నెల వరకు అనుమతిస్తారు. ఆ రోజుల్లో అధిక సంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకొని అక్కడ ఉన్న శివలింగాన్ని దర్శించుకుంటారు. మే నెల తరువాత వెల్లయంగిరి కొండపైకి భక్తులను అనుమతించడం లేదు. ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చే భక్తులు కొండ కింద ప్రాంతంలో ఉన్న పూండి ఆండవర్ శివాలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం అక్కడ పూజా సామగ్రి దుకాణాలను ఏర్పాటు చేశారు. మంగళవారం అక్కడికి వచ్చిన ఏనుగు దుకాణాలను ధ్వంసం చేసింది. ఏనుగును చూసిన వ్యాపారులు, భక్తులు అక్కడి నుంచి పారి పోయారు.

నకిలీ వైద్య ధ్రువపత్రాల వ్యవహారంలో

సుబ్బయ్య పాండియన్ అరెస్టు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరం సమీప కోవిలంపూండి గ్రామంలో వెక్కల్ వంతెన వద్ద అన్నామలై విశ్వవిద్యాలయం పేరిట తయారు చేసిన నకిలీ ధ్రువపత్రాలను ఈ ఏడాది జూన్ 19న స్థానికులు గమనించారు. వారి సమాచారంతో వర్సిటీ నిర్వాహకులు స్వాధీనం చేసుకొని పరిశీలించారు. నకిలీవిగా తేలడంతో రిజిస్ట్రార్ కిల్లాయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చిదంబరం మన్మథసామి నగర్‌కు చెందిన శంకర్, నాగప్పన్ అరుళ్ ప్రకాశంను అరెస్టు చేశారు. ప్రముఖ వర్సిటీల పేరిట నకిలీ వైద్య ధ్రువపత్రాలు తయారు చేసి విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం కేసును సీబీసీఐడీకి బదిలీ చేశారు. ధ్రువపత్రాల తయారీలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, తిరుచ్చికి చెందిన సుబ్బయ్య పాండయన్‌కు సంబంధం ఉన్నట్లు తెలిసింది. సోమవారం రాత్రి సుబ్బయ్య పాండియన్ ఇంట్లో తనిఖీలు చేసి సుమారు 10కి పైగా నకిలీ ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకొని కడలూర్‌కు తీసుకొచ్చారు.



సుబ్బయ్య పాండియన్‌ను తీసుకెళుతున్న పోలీసులు

హత్య కేసులో నిందితుడి పట్టివేత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి జిల్లా శ్రీరంగంకు చెందిన రౌడి చంద్రమోహన్ హత్యకేసులో నిందితుడు రౌడి సురేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల బెయిల్‌పై వచ్చిన సురేష్‌ను సోమవారం రౌడి చంద్రమోహన్ అనుచరులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కానీ ప్రధాన నిందితుడు తిరువానక్కావల్‌కు చెందిన జంబుకేశ్వరన్(36) కోసం పోలీసులు గాలిస్తూవచ్చారు. అతను వన్నత్తుపూచ్చి ప్రాంతంలో దాగి ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు మంగళవారం అక్కడికి చేరుకున్నారు. వారిని చూసిన జంబుకేశ్వరన్ పారిపోయేయత్నం చేయడంతో తుపాకితో కాలిపై కాల్చి పట్టుకుని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుకోట్టై జిల్లా కలెక్టర్ అరుణ పేరున నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించబడింది. ఆ ఖాతాలో ఉన్న కొంత సమాచారం అనుమానం కలిగించేలా ఉండడంతో పలువురు జిల్లా నిర్వాహానికి సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ సైబర్‌క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను ప్రారంభించింది రాజస్థాన్‌కు చెందిన ముఠాగా గుర్తించి ఖాతాను పోలీసులు బ్లాక్ చేశారు.

18 సవర్ల బంగారు నగల చోరీ

రెడ్‌హిల్స్: తిరునింద్రవూరు సమీప అభిరామినగర్‌కు చెందిన రామకృష్ణన్ చెన్నై నౌకాశ్రయంలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రించాడు. మంగళవారం ఉదయం లేచి చూడగా పక్క గదిలోని బీరువాలో 18 సవర్ల బంగారు నగలు, అర కిలో వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించి నగదు దోచుకుంటున్నారని ఫిర్యాదు

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై అన్నానగర్‌కు చెందిన 39 ఏళ్ల మహిళ విళాత్తికుళం కమిషనర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో.... తనకు భర్త లక్ష్మణన్, ఇద్దరు కుమారులు ఉన్నారని, పదేళ్ల క్రితం భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నట్లు తెలిపారు. చిన్నకుమారుడికి బాక్సింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండడంతో రేస్ కోర్స్ మైదానంలో బాక్సింగ్ శిక్షణకు పంపినట్లు తెలిపారు. అక్కడ అతనికి దేవరాజ్, రాజ్‌కుమార్ ఇద్దరు శిక్షణ ఇచ్చేవారని, తన కుమారుడిని పలు పోటీలకు తీసుకెళ్లి, తిరిగి ఇంట్లో వదిలి వెళ్లేవారని చెప్పారు. దీంతో తనకు వారితో పరిచయం ఏర్పడడంతో తన సెల్‌ఫోన్ నెంబరు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తన కుమారుడు పదో తరగతి చదువుతున్నాడని, పబ్లిక్ పరీక్షలు దృష్టిలో ఉంచుకుని బాక్సింగ్ శిక్షణకు పంపలేదన్నారు. ఈ నేపథ్యంలో దేవరాజ్, రాజ్‌కుమార్‌లు తమ వద్ద తన అసభ్యకర ఫొటో ఉందని, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తామని, బెదిరించి తన వద్ద రూ.4 లక్షల వరకు నగదు తీసుకున్నారని తెలిపారు. అయినప్పటికీ తనను మళ్లీ నగదు ఇవ్వాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

ప్యారిస్, న్యూస్‌టుడే: ట్రిప్లికేన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు శివానందం సాలైలో గస్తీ పనులు చేపట్టారు. అప్పుడు ఆ వైపుగా వచ్చిన కారును ఆపి తనిఖీ చేయగా అందులో పొగాకు ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించి తరలించిన చందన్‌సింగ్‌ను అరెస్టు చేసి, 284 కిలోల పొగాకు ఉత్పత్తులు, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



అరెస్టయిన చందన్‌సింగ్

వాహన తనిఖీల్లో..

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిర్తుణిలోని అరక్కోణం రోడ్డులోని వల్లియమ్మాపురం ప్రాంతంలో స్థానిక పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. అప్పుడు అటుగా ద్విచక్ర వాహనంలో వచ్చిన ముగ్గురిని తనిఖీ చేశారు. వారి వద్ద నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు బస్తాలో తెచ్చినట్లు గుర్తించారు. దీంతో అరక్కోణంకు చెందిన సతీష్, జయకిషోర్, సుమన్‌లను అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నగరి నుంచి మత్తు పదార్థాలు కొనుగోలు చేసి అరక్కోణంలోని దుకాణాలకు విక్రయించేవారని గుర్తించారు. పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చౌక దుకాణంలో..

తిరుత్తణి: తిరుత్తణి తిరువాలంగాడు సమీపంలోని చిన్నమ్మపేట్టై గ్రామానికి చెందిన సెల్వం కుమారుడు విఘ్నేష్ (23) చౌక దుకాణం నడుపుతున్నాడు. ఇతను నిషేధిత పొగాకు ఉత్పత్తులైన గుట్కా వంటి వాటిని అదనపు ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. మంగళవారం పోలీసులు అతని దుకాణంలో సోదా చేయగా అతను జేబులో దాచుకున్న 10 పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆహార భద్రతాశాఖ అధికారులు దుకాణానికి సీల్ వేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విఘ్నేష్‌ను అరెస్ట్ చేశారు.

పార్సిల్‌లో గంజాయి తరలింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురైలో ఉన్న కొరియర్ సంస్థకు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన పార్సిల్‌పై అనుమానం రావడంతో కొరియర్ సంస్థ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు పార్సిల్‌ను పరిశీలించగా అందులో 26 కిలోల గంజాయి ఉన్నట్లు తెలిసింది. అందులో ఉన్న అడ్రసు సరిగ్గా లేకపోవడంతో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పళని పంచామృతంపై అనుచిత వ్యాఖ్యలు

కటకటాల్లోకి సినీ దర్శకుడు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పళని పంచామృతంపై అనుచిత వ్యాఖ్యలు వ్యాప్తి చేసిన చలనచిత్ర దర్శకుడు మోహన్.జిని తిరుచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన ప్రైవేట్ న్యూస్ ఛానెల్ ఇంటర్వ్యూలో 'పళని పంచామృతంలో గర్భనిరోధక మందులు ఉపయోగించారని, అందుకు ఆధారాలు లేవు' అని పేర్కొన్నాడు. తిరుచ్చి, పళని తదితర పలు ప్రాంతాల్లో ఆయనపై పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుచ్చి జిల్లా ఎస్పీ వరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు చెన్నై రాయపురంలో ఉన్న దర్శకుడిని ప్రత్యేకబృందం మంగళవారం అరెస్టు చేసింది. అనంతరం తిరుచ్చికి తీసుకొచ్చారు.



దర్శకుడు మోహన్

మాజీ మంత్రి వైద్యలింగంపై కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే మాజీ మంత్రి వైద్యలింగంపై అక్రమాస్తుల కేసు నమోదు అయింది. అన్నాడీఎంకే మాజీ మంత్రి, ఓపీఎస్ మద్దతుదారుడైన వైద్యలింగం అన్నాడీఎంకే హయాంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు భవన నిర్మాణ పనులకు రూ.27 కోట్లు లంచం తీసుకున్నట్లు అవినీతి నిరోధక కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆదాయానికి మించి అధికంగా ఆస్తులు కూడబెట్టినట్లు వైద్యలింగంపై అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసింది.